
# ఆయ్రాళ్ళ మనిషి



+ సురేశ్‌చంద్ర
+ చిత్రాలు: ముఖి,మున్వర్

పన్నెండు గంటలప్పుడు మధ్యాహ్నాం. నాచన సోముడు రోడ్డుకు నిట్టంగా నిలబడి దీర్ఘాలోచి స్తున్నాడు.

అయితే నర్సిమ్ములుగాడు పేచీకే సైయ్యన్నాడన్నమాట.

వాడికి నాతో అవసరం తీరిపోయిందన్నమాట.

అంటే, ఇప్పుడు తనక్కూడా వాడికి వ్యతిరేకంగా మాట్లాడే రైటుంది.

అయితే నర్సిమ్ములుగాడు తగువుకే సిద్ధమయ్యా డన్నమాట.

వాడికి నాతో గొడవేసుకోవటమే ముఖ్యమన్నమాట.

అంటే, ఇప్పుడు తనక్కూడా వాడితో ఎదురుగొడ వేసుకునే అధికారముంది.

రైట్.. ఇయ్యాల తేలిపోతుంది. తానా, నేనా?

సరే.. ఇయ్యాల ఖరారౌతుంది. వాడా, వీడా?..!

* * *

చుట్టపొగల మధ్యన రచ్చబండ విలాసంగా కూర్చుంది. న్యాయమూర్తి కొండెక్కిన సంబరంలో వున్నాడు. దొరక్క దొరక్క దొరికిన కేసు.

"అయితే, నాచనసోముడు నిన్ను దరిద్రుడా అని తిట్టాడంటావ్?"

చిత్తమన్నట్టు తల వంకించాడు నర్సింహులు.

"వాడన్నదాన్ని నువ్వొప్పుకుంటున్నావా?" ఈసారి వెంకట్రాముడు సోముడిని అడిగాడు. నాచనసోముడు విరుద్ధంగా తలూపాడు.

"అయితే - వాదనలు వినక తప్పదన్నమాట" పైకి నీరసంగా, లోపలికి ఉత్సాహంగా అన్నాడు వెంకట్రాముడు. ఇద్దరూ చప్పున అవుననేశారు.

వెంటనే వెంకట్రాముడు గాల్లోకి చెయ్యెత్తి పిడికిలి బిగించి ప్రతిజ్ఞ చదివాడు.

"ధర్మదేవత మీద ఆన. ఈ తగువు న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా తీర్చెదననీ, నా, పర భేదాలు చూడననీ, సర్వమానవ సామాన్యతను నైతికంగా ఋజువు చేసెదననీ ప్రమాణం చేస్తున్నాను. ఎట్టి పరిస్థితుల్లోనూ సమాజం పరిధుల్లోనే దీనిని పరిష్కరించెదననీ, అంతరాత్మనే ప్రామాణికంగా తీసుకునెద ననీ ప్రతిజ్ఞ చేస్తున్నాను. ఒకవేళ అంతరాత్మకు విరుద్ధంగా - పొరపాటున అన్యాయాన్ని గెలిపించితి నేని అది నా యొక్క తప్పిదము కాదని, ఆ ధర్మదేవతే గత జన్మ సంబంధము, భవిష్యకార్యముల మీద ఆలోచనతో ఈ విధమైన తీర్పు చెప్పినదని భావించవలెను. యదాయదాహి ధర్మస్య..."

అందరూ చప్పట్లు కొట్టారు.

వెంకట్రాముడు ప్రాసిక్యూషన్ కొనసాగించమన్నట్టు తల ఒకపక్కకి లాగివూపాడు. మహంకాళి నాచనసోముడు,నర్సిమ్ముల మీద పసుపు నీళ్ళు చల్లింది.

వాదనలు ప్రారంభమయ్యాయి.

"అసలేం జరిగిందంటేనండీ.. ఈ సోముడున్నాడు గదండీ, వాడికి నా మీద మంటండీ. తీవరమైన దుగ్ధండీ.ఆ దుగద్తోటే లక్ష్మీవారం సాయింత్రం వీరాపురం సాంబశివుడి పొలం దగ్గర, నడిబజార్న బట్టుకుని నన్ను 'దరిద్రుడా' అన్నాడండీ! అట్టా అనటం మంచిపద్ధతి గాదని సెప్పానండీ. కానీ వాడది యినే పరిస్థితిలో లేడండీ! సరే, ఎవుని కర్మానికి వాడు పోతాడని నేను నోర్మూసుకుని యెనక్కి నడవటం మొదలుపెట్టానండీ. కానీ, ఎనకనుంచి సోముడు ఎటకారం మొదలు పెట్టాడండీ! నన్ను ఎకసెక్కం చేసేశాడండీ! దాంతో మనసు ఆతరం ఆపుకోలేక, గత్యంతరం లేక నేనూ యెదవా అనేశానండీ. అంతే, నన్ను యెదవా అంటావా అని ఇష్టమొచ్చినట్టు కొట్టాడండీ!" - పూస గుచ్చేశాడు నర్సిమ్ములు.

'అందుకు సాక్ష్యం..' అడిగాడు వెంకట్రాముడు.

"ఈ వీరాపురం సాంబశివుడేనండీ.!" నర్సిమ్ములు సాంబశివుడిని చూపించాడు.

"ఏం సాంబశివుడూ.. ఏమంటావ్?"

సాంబశివుడు భుజం మీది కండువా దులుపుకుని జనం మధ్యనుంచి లేచొచ్చాడు. చేతులు కట్టుకుని నిలబడి చెప్పాడు.

"నిజమేనండీ..! లక్ష్మీవారం సాయంత్రం నా పొలం దగ్గరే నాచనసోముడు నర్సిమ్ములు గాడిని దరిద్రుడా అని తిట్టేడండీ! అది నేను నా కళ్ళారా చూశానండీ! ఆ తర్వాత కొట్టాడండీ. ఇది కూడా నేను నా రెండుకళ్ళతోటి చూశానండీ!"

"దీనికి నువ్వేమంటావ్?" వెంకట్రాముడు సోముడిని అడిగాడు.

"చస్తే అంగీకరించనండీ! నర్సిమ్ములు తీవరమైన అబద్ధం ఆడతన్నాడు. ఆడిని నేను తిట్టిన మాట అవాస్తవమండీ! కొట్టిన మాట కూడా అవాస్తవమేనండీ! కానీ, మేమిద్దరం వీరాపురం సాంబశివుడి పొలం దగ్గర కలవటం మాత్రం నిజమండీ" - చెప్పాడు సోముడు.

వెంకట్రాముడు సాలోచనలో పడ్డాడు.

వీరాపురం సాంబశివుడి పొలం దగ్గర ఇద్దరూ కలుసుకున్నట్టు ఇద్దరూ ఒప్పుకుంటున్నారు. నర్సిమ్ములు కొట్టాడంటాడు. కానీ నాచనసోముడు దానిని ఒప్పుకోవట్లేదు. ఈ చిక్కుప్రశ్న ఛేదించే మార్గమేమిటి? ఈ ఉచ్చు ముడిని విడదీసే మార్గమేమిటి?

*వీరాపురం సాంబశివుడిని నమ్మొచ్చా?*

*సాంబశివుడి మీద గతంలో పొలం గట్ల తగాదాలున్నాయి. మాజీ నేరస్తుడు చెప్పే సాక్ష్యానికి ఎంతవరకూ విలువివ్వాలి?*

*సాంబశివుడి సాక్ష్యం వదిలేస్తే - ఇంకో సాక్షి దొరకడు.*

కేసు అనవసరంగా కొట్టేయాల్సి వస్తుంది. ధర్మదేవత మీద ఆన పెట్టుకుని బండ మీద కూర్చున్నాను. కేసు కొట్టేసి ఎలా బండ దిగాలి?

పోనీ నాచనసోముడు నిజంగా కొట్టలేదనుకుందామా? వాడికి వూర్లో ఆర్.నాగేశ్వర్రావని పేరుంది. పోనీ నర్సిమ్ములు అబద్ధం ఆడుతున్నాడందామా? యేటా తొలి పండక్కి వూర్లో హరిశ్చంద్రుడి వేషం వేసేది వాడే!

ఇద్దరికీ సమానమైన అర్హతలున్నాయి. ఇద్దరి జీవితాల్లోనూ అనుమానాస్పద ఛాయలున్నాయి. ఇద్దరి మనస్తత్వాల్లోనూ వైరుధ్యాలున్నాయి. ఇద్దరి ఆలోచనల్లోనూ కుట్రలున్నాయి.

ఇద్దరూ ఎండుగడ్డికి అటూఇటూ నిలబడ్డారు.

ఇప్పుడెలా ఈ ధర్మసందేహం తీర్చటం..?

నిజంగా నాచనసోముడు నర్సిమ్ములుని దరిద్రుడా అని తిట్టాడా? నిజంగానే నర్సిమ్ములు దరిద్రుడే! వాడికి వూర్లో ఆస్తుల కంటే అప్పులే ఎక్కువ. దీన్ని పాయింటుగా చేసుకుని తీర్పు చెప్పొచ్చా? - దరిద్రాన్ని కూడా లాపాయింట్ చేయగల నేర్పరితనం సాంబశివుడికుంది. వాడు దీన్ని క్రాసింగు చేస్తే?

పోనీ, నర్సిమ్ములు చెప్పింది నిజమేనని సాంబశివుడి సాక్ష్యం బేరేజుగా తీర్పు చెప్పేస్తే...?

ఛ..ఛ..! వెయ్యిమంది నేరస్తులయినా తప్పించుకోవచ్చు కానీ వొక్క నిర్దోషికి శిక్ష పడకూడదు. ఇది ధర్మదేవతకి గొప్ప అపచారం. నిర్దోషికి అపరాధిత్వం దెబ్బ తగలకూడదు. నేనెప్పుడూ నిర్దోషుల పక్షమే!

కానీ నాచనసోముడు నిర్దోషి అనాలన్నా కుదరదే! వాడు గొప్ప నేర్పరి. వాడు పుస్తకాలు కూడా చదువుతుంటాడని వూర్లో జనం అంటుంటారు.

మరి ఇప్పుడేమిటి చేయాల్సింది?

మరి ఇప్పుడేమిటి ఆలోచించాల్సింది?

మరి ఇప్పుడేమిటి నిర్ణయించాల్సింది?

వెంకట్రాముడికి చిక్కుముడి పడింది. ఒకరికి మోదం, ఒకరికి ఖేదం.. చివరికి నేనే ఇరుక్కునేట్టున్నాను.

విరాటరాజు కొలువులో తల్లీబిడ్డల తగాదా తీర్చిన ధర్మరాజు కథ 'నర్తనశాల'లో చూపిస్తారు. ఆ సన్నివేశం గుర్తొచ్చింది వెంకట్రాముడికి.

ఇక విరాటరాజు పాత్ర పోషించక తప్పదు.

మరిక్కడ ధర్మపన్నాలు చెప్పగల కంకుభట్టు ఎవరు? కొద్దిసేపు చాలా తీవ్రంగా ఆలోచించాడు వెంకట్రాముడు. చాలా చిన్న కేసు. పరిస్థితి మాత్రం తీవ్రంగా వుంది. అయినా, అంత వేగంగా తోసేసే కేసు కాదని అర్థమైపోయింది.

"తప్పదు, ఎడ్జర్న్ చేయాల్సిందే! మిగతా రేపు.." - నిశ్చయించేసుకున్నాడు. గొంతు సవరించుకుని ఉత్కంఠగా ఎదురుచూస్తున్న పామరులని ఉద్దేశిస్తూ చెప్పాడు.

॥తగువు మొత్తం విన్న తరవాత ఇది సాధారణమైన కేసు కాదని, ఇందులో కొన్ని దీర్ఘ సత్యాలున్నాయని, వాటిని పరిశీలించాల్సి, పరిశోధించాల్సిన అవసరం చాలా వుందని నాకు అర్దం అవుతున్నది. ఇది ఇద్దరి వ్యక్తిగత జీవితాలకు సంబంధించిన సమస్య. ఇద్దరి పరువు ప్రతిష్ట లకు సంబంధించిన సమస్య. ఇందులో ఏ చిన్న తేడా వచ్చినా వూర్లో ఇద్దరి పరువు ప్రతిష్టలకు తీవ్రమైన భంగం కలుగుతుంది. కాబట్టి యీ రాత్రంతా ఆలోచించుకుంటానిగ్గాను ధర్మదేవత ఆదేశానుసారం వొకరోజు గడువు తీసుకుంటున్నాను. రేపు ఇదే వేళకి మళ్ళీ తగువు విచారణ ప్రారంభమౌతుంది ॥ - తాను చెప్పాలనుకున్నది చెప్పేసి లేచి పంచె దులుపుకున్నాడు వెంకట్రాముడు.

నాచనసోముడు తను కూడా లేచి కండువా విదిల్చుకున్నాడు. వెంకట్రాముడి ముఖంలోకి చూసి చాలా సీరియస్‌గా అన్నాడు.

"ఇయ్యాల వాదం వదిలేసి పోతున్నారు. రేపటిదాకా ఆలోచిస్తానంటున్నారు. ఆలోచించండి. కానీ మీ ఆలోచన న్యాయబద్ధంగా, ధర్మబద్ధంగా, వూరిబద్ధంగా వుండాలి. తగువుకులో రెండు జీవితాలు ముడిపడున్నాయి. మా జీవితాల్లోకి ప్రవేశించకుండా ఈ తగువు తీర్చాలి. మా జీవితాల్లో జోక్యం చేసుకోవటమంటే మీ పరిధి అతిక్రమించినట్టవుతుంది. కాబట్టి మీ జీవితం సాక్షిగా దీనిని పరిష్కరించండి"

సోముడి ప్రశ్న వెంకట్రాముడిని కలవరపరిచింది. సోముడు తన న్యాయబద్ధతను ప్రశ్నించటానికి వచ్చిన పరిశీలకుడిలా కనిపించాడు వెంకట్రాముడికి.

జీవితం ఎంత చేదయింది? ఎంత ఉదాసీనమయింది? ఇప్పటిదాకా తన నిర్ణయం ఊరికి శిరోధార్యం. ఇప్పుడు తన నిర్ణయం ఒక ప్రశ్న. ఛేదించుకోవటానికి సునాయాసమైన మార్గమొకటి కావాలి. వ్యవస్థ మీద అసలైన ప్రశ్న గురించి ఆలోచించాలనుకున్నాడు.

ఎర్రటి ఎండలో వెంకట్రాముడి తోలు చెప్పుల్లోంచి వేడి పొగలు మొదలయ్యాయి.


రానున్న రోజంతా తన జీవితంలో అతి కీలకం.

*   *   *

చింతలపూడి పోలీస్‌స్టేషన్ ముందు కానిస్టేబుల్ గౌర్రెడ్డి - ఏసోబు, శంకర్రాజులతో సీరియస్‌గా చర్చిస్తున్నాడు. వాళ్ళిద్దరూ చెప్పిందంతా గౌర్రెడ్డి మళ్ళీ మళ్ళీ మననం చేసుకుంటున్నాడు. ఈసారి ఆ వూర్లో అడుగు పెట్టాలనే కోరిక అతనిలో బలపడిపోయింది.

*   *   *

నడిరేయిపూట - పెరటిమంచం మీద కూర్చుని వెంకట్రాముడు దీర్ఘాలోచన చేస్తున్నాడు. గడువు దగ్గరపడిపోతోంది. ఏదీ సూటిగా నిర్ణయించలేకపోతున్నాడు. ఏదీ తెమిలేట్టు కనిపించటం లేదు. వెంకట్రాముడి ఆలోచనలు ఇతమిద్ధంగా ఒకచోట నిలవటం లేదు.



గొడవ ఏదోలా తేల్చేయొచ్చు. సోముడుగాడు వెల్లడి చేసిన ప్రశ్నకి సమాధానం ఎలా చెప్పాలనేది ఇతమిద్ధమైన ప్రశ్న. నాచనసోముడి ప్రశ్న చాలా చిత్రంగా వుంది. వాడడిగిన తీరు కూడా విచిత్రంగా వుంది. వాళ్ళిద్దరి జీవితాల్లోకి ప్రవేశించకుండా తన జీవితంలోంచే సాక్ష్యం తీసుకోవాలన్నాడు. తీర్పు తన జీవితంలోంచే రావాలన్నాడు. అంటే నా జీవితంలోంచి వాళ్ళిద్దరి జీవితాల గురించిన వ్యాఖ్యానాలు చేయాలా? ఆ రూపంలో చూసినా తనకు వ్యాఖ్యానాలు చేసే హక్కు లేదని సోముడు ఖరాఖండీగానే చెప్పేశాడు. చివరిదాకా వస్తే.. ఇక తన జీవితంలోంచే కారణాలు వెతుక్కోవాలి. అంటే.. వాళ్ళ గొడవ పరిష్కారానికి తన జీవితమే సాక్ష్యం కావాలా? అంటే సోముడి ఉద్దేశం..

వెంకట్రాముడు పాతయుగంలోకి ప్రవేశం చేశాడు.

తన నిఖార్సయిన జీవితం ప్రారంభ క్షణాలను గుర్తు చేసుకున్నాడు.

తన జీవితంలో వెలుగుయుగం ప్రారంభమైంది జగడాలతోటేననే సత్యం జ్ఞాపకం చేసుకున్నాడు. ఆ జగడాలే తనని ఊరిపెద్దని చేసిన సంగతులు మననం చేసుకున్నాడు. తన ఆరంభ జీవితం పాత సినిమాలా నలుపుతెలుపులో అతని మూసిన కళ్ళలోంచి తిరుగుతోంది.

తానెన్నిసార్లు ఎందరితో గొడవ పడలేదు?

ఎన్నిసార్లు కృష్ణజన్మస్థానం చూసిరాలేదు!

ఎంతమందికి ఉనికి లేకుండా చేయలేదు..!

ఒక నేరస్తుడు ఇంకో నిందితుడి మీద తీర్పు చెప్పొచ్చా? అలా చెప్పే అవకాశం వున్నప్పుడు ఇది ప్రజాస్వామ్యం ఎందుకవుతుంది? తన జీవితంలోంచి సూటిగా ఇంకో జీవితంలోకి వెళ్ళిపోయి తీర్పుచెప్పాల్సిన అంశాన్ని దొంగిలించుకు రావచ్చా?

తాను నమ్మే 'గీత' ఏం చెప్తోంది? కర్మ సిద్ధాంతం, రానీతిసూత్రాలు ఏం చెప్తున్నాయి? తను ఆలోచిస్తున్న సారమంతా చెప్తున్నాయి కదా! ఇంత తెలిసీ తాను తీర్పరి స్థానం ఆక్రమించటం దోషమే అవదా?

ఇది చాలా చిత్రమైన సమస్య. కనుచూపులో వున్న పరిష్కారాన్ని తన జీవితంలోంచి శోధించుకురావాలి.

ఇది చాలా విచిత్రమైన సమస్య. అందుబాటులో లేని న్యాయసూత్రాల్ని పరిశోధించుకురావాలి.

తను నమ్మే సిద్ధాంతమే తన నీతిసూత్రమవుతుందా? తను నమ్మే నేపథ్యమే ఈ తగువు తీర్చే ఆయుధమవుతుందా? ఈ సందిగ్ధానికి సమాధానం తను తీర్పరి స్థానం నుంచి తొలగిపోవటమేనా? అలా అయితే కొత్త తీర్పరి ఎవరు?

తరచితరచి చూస్తే ప్రపంచంలో ప్రతి వాడూ ఒక నిందితుడే! ప్రతి నిందితుడూ న్యాయమూర్తే. ప్రతి సంఘటనా ఏదో ఒక నేపథ్యానికి మూలసూత్రంగా వుంటుంది.

ఘటన భూభ్రమణం లాంటిది. అంతస్సూత్రాలు లేకున్నా తనచుట్టూ తాను తిరుగుతూనే వుంటుంది. సంఘటనా అంతే! ఒక పరిధికి చుట్టుకుని వంద పరిధుల్లో విస్తృతమవుతుంటుంది.

తన న్యాయజీవితం కూడా అంతే! ఎవరికి వారే తీర్పుచెప్పే ఆసాములయినప్పుడు....తను ఊరి పెద్ద. ఊరి ఆచారాల్ని, శాసనాల్ని రక్షించాల్సిన బాధ్యత వున్న వాడు. ఇలాంటి ఉల్లిపొరలను ఛేదించటానికి ఇంకోలా ఎందుకు ఆలోచించాలి. తాను తనలాగే ఆలోచిస్తాడు. తాను తనలాగే తీర్పిస్తాడు. తాను తన తత్వాన్నే వివరిస్తాడు.



మిగిలింది పేజీ 29లో

75 పేజీ తరువాయి



నాచనసోముడి వొకేవొక ప్రశ్న అతని జీవితం అసాంతమూ కళ్ళముందు పెట్టింది. తన స్వభావానికి తానే క్షమాపణ చెప్పుకోవాల్సిన అవసరం వుందని గ్రహించుకున్నాడు. అప్పుడు అతని మనసు కుదుటపడింది. చెప్పాల్సిన విషయం నెమ్మదిగా మనసులోనే అనుకున్నాడు. ఇక ఏ కంకుభట్టూ అవసరం లేదనుకున్నాడు.

*　　　*　　　*

తెల్లారేసరికి గౌర్రెడ్డి వూర్లోకి దిగిపోయాడు. జనం మద్దిస్తం దగ్గర చేరటానికి ఇంకా చాలా సమయముందని తెలుసుకున్నాడు. తను వచ్చిన పనిలో మొదటి అంకం ప్రారంభించటానికి నిశ్చయించుకున్నాడు.

తిన్నగా వెంకట్రాముడి ఇంటి దగ్గరికి దారితీశాడు. వెంకట్రాముడు వాలుకుర్చీలో పడుకుని ఆలోచిస్తున్నాడు. గుండెలమీద భగవద్గీత తెరిచిపెట్టి వుంది. గౌర్రెడ్డి రావటం గురించి పాలేరు వెంకట్రాముడికి చెప్పాడు. పోలీసు లోపలికి రావటానికి ఒప్పుకున్నాడతను.

గౌర్రెడ్డి లోగిలి లోపలికొచ్చి వెంకట్రాముడిని దీర్ఘదృష్టితో చూశాడు. వెంకట్రాముడు అపరిచితుణ్ణి సందేహంగా చూశాడు. ఎదురుకుర్చీ చూపించాడు.

"టౌన్ పోలీస్‌స్టేషన్ నుంచొచ్చాను" కొంత దర్పంగా అన్నాడు గౌర్రెడ్డి.

వెంకట్రాముడికి ఆ దర్పం ఖాకీ దుస్తులది మాత్రమేనని స్పష్టంగా తెలుసు.

"పోలీసోడివని అర్థమైతానే వుందిలే, ఏంటో చెప్పు" - ఇప్పుడు వెంకట్రాముడు నిర్భీతిగా వున్నాడు. నైతిక ధర్మాల మీద, స్వానుభవాల మీద ఆ రాత్రంతా జీవితాన్ని వడబోసుకున్న వెంకట్రాముడు విశ్వజ్ఞానం తెలుసుకున్న మౌనిలా వున్నాడు. ప్రాపంచిక నేపథ్యం వంటపట్టించుకున్నవాడిలా వున్నాడు. గౌర్రెడ్డి కళ్ళలోకి సూటిగా చూశాడు. గౌర్రెడ్డి నిండుకుండలా నవ్వాడు.

"నిన్న మీ వూర్లో మద్దిస్తం జరిగిందని తెలిసింది. వూళ్ళో గొడవలన్నీ మీరే పరిష్కరిస్తున్నారని సమాచారం అందింది. ఇది పోలీసోళ్ళ పని. మీరు పోలీసు వ్యవస్థకి చెందినవారు కాదు. కానీ మీరిక్కడ ప్రయివేటు పోలీసు వ్యవస్థ నెలకొల్పారని మా సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గారు తీవ్రంగా ఘోషిస్తున్నారు. ఎవరి పర్మిషన్‌తో మీరు వూర్లో పోలీస్‌స్టేషన్ శాఖను ఏర్పాటు చేశా రనే విషయం మీద ఆరా తీయటానికి సర్కిల్ గారు నన్ను పంపారు."

వెంకట్రాముడు యింకా గౌర్రెడ్డి కళ్ళలోకి సూటిగా చూస్తూనే వున్నాడు. గౌర్రెడ్డికది భీతిలా కనిపించింది. వెంకట్రాముడికి గౌర్రెడ్డి వ్యవస్థకి పట్టిన చీడపురుగులా కనిపించాడు.

సమాజంలో ఎవరు ఎవరికి తీసిపోతారు?

పోలీసులు,ప్రజలు వర్గశత్రువులు. ఇద్దరి విభేదాలూ ఎప్పటికీ తీరేవి కాదు. అంటే, వ్యవస్థ మీద వాళ్ళిద్దరికీ వున్న అపారమైన నమ్మకాన్ని వాళ్ళ బలాబలాలే నిలబెడతాయన్న సత్యం పోలీసులూ,ప్రజలూ ఇద్దరూ మర్చిపోకూడదు. ఇది చారిత్రకసత్యంగా గుర్తుంచుకోవల్సిన సత్యం.

"..కాబట్టి నేను కొన్ని ప్రశ్నలడుగుతాను, వాటికి సమాధానం చెప్పండి.."దాదాపు ఆజ్ఞాపించినట్టుగా అన్నాడు గౌర్రెడ్డి. వెంకట్రాముడు మళ్ళీ సూటిగానే తలూపాడు.

"వూరు మీ తాతలదీ కాదు, మీరు లా ప్రాక్టీసూ చేయలేదు. మరి ఎందుకు తీర్పులిస్తున్నారు? ఇది వొకటో క్వశ్చను. వూర్లో గొడవలు జరిగితే పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా మీరు పోలీసులకు రిపోర్టు ఇవ్వాలి. పోలీసు అధికారులు చర్యలు తీసుకునే వరకూ వేచివుండాలి. అంతేకానీ తగుదునన్నట్టు వూరి గొడవలన్నీ భుజాన వేసుకోవటం మీద మీ సంజాయిషీ ఏమిటి? యిది రెండో క్వశ్చను. ముందీ రెంటికీ సమాధానం చెప్పండి, తర్వాత మిగతావి క్వశ్చన్ చేస్తాను"

వెంకట్రాముడు గుండెలమీది 'గీత' తీసి పక్కనపెట్టాడు. గౌర్రెడ్డిని గంభీరంగా చూశాడు.

"..ముందు నేనడిగిన కొన్ని ప్రశ్నలకు నువ్వు సమాధానం చెప్పు" అన్నాడు.

గౌర్రెడ్డి ఖంగుతిన్నాడు. పదకొండున్నరేళ్ళ పోలీసు జీవితంలో తాను క్వశ్చనేస్తే తలొంచుకు, చేతులు కట్టుకు విన్నవాళ్ళే కానీ ఎదురుప్రశ్నలు వేసే వాళ్ళను చూడలేదు. తన లాఠీ దెబ్బకి ఖంగు తిన్నవాళ్ళేకానీ తిరిగి ప్రశ్నించిన వాళ్ళు లేరు. 'అయినా చూద్దాం.. ఈ నీతికోవిదుడి ప్రశ్నలకున్న విలువేంటో' అన్నట్టు చూసి 'చెప్పు'మన్నాడు.

"నువ్వెప్పుడైనా ఆకలితో పడుకున్నావా"?

పోలీసు ఆకలి సంగతి గౌర్రెడ్డికి బాగా తెలుసు. దీనికీ అతని దగ్గర సమాధానం లేదు.

'...'

'నువ్వెప్పుడైనా ఖైదీలకు పెట్టే కూడు తిన్నావా?'

పోలీసు ఆకలికి తరతమ భేదాలుండవని గౌర్రెడ్డికి బాగా తెలుసు.

'... ...'

'నువ్వెప్పుడైనా నీ జీవితంలో ప్రేమ గురించి ఆలోచించావా?'

గౌర్రెడ్డికి జీవితంలో ప్రేమ గురించి ఆలోచించే అవసరమెప్పుడూ రాలేదు.

గౌర్రెడ్డి వెంకట్రాముడికి తలబిరుసనుకున్నాడు. వెంకట్రాముడు తనలోకంలోకి రాలేదని గ్రహించుకున్నాడు. వెంకట్రాముడడిగిన మూడు ప్రశ్నలూ సుత రామూ అర్థం కాలేదతనికి. కానీ వెంకట్రాముడి గొంతులో అదో విధమైన హెచ్చరిక స్వరం వినిపిస్తోంది. సూటిగా తననే ప్రశ్నిస్తున్నట్టు - ..అది గౌర్రెడ్డిని కొంచెం తగ్గేలా చేసింది.

"..అయితే ఇంతకీ తమరేమంటారు? " - గౌర్రెడ్డి వ్యంగ్యంగా అడిగేశాడు వెంకట్రాముణ్ణి.

వెంకట్రాముడు జీవితసత్యం చెప్పటం ప్రారంభించాడు.

"జీవితం అంటే మనిషి బతికే కాలం కాదు. మనిషి జీవితంలో బోలెడు జీవితాలుంటాయి. ఒక్కో జీవితానిదీ ఒక్కోదారి, ప్రాపంచికం నుంచి మొదలయ్యే జీవితం భౌతిక శరీరం మట్టి కాగానే అంతం కాదు. ఆ జీవితం పదిమంది జీవితాలకీ గుర్తున్నంతవరకూ అది సజీవురాలే! జీవితానికి ముడిపదార్థాలు లెక్కలేనన్ని. ఒక్కో సందర్భంలో ఒక్కో అణువిస్ఫోటన జీవితాన్ని నడిపిస్తుంది. ఈ విచ్ఛిన్న శకలాలే మనిషి అంతర్గత శక్తిని కదిలిస్తాయి...."

గౌర్రెడ్డికి ఈ వేదాంతం 'లా సెక్షను'లాగా కనిపించలేదు. సత్సంగులు అరిషడ్వర్గాల గురించి చెప్పే ఉపాఖ్యానంలా వినిపించింది. వేదాంతంలో సెక్షన్లుండవని గౌర్రెడ్డి విశ్వాసపడ్డాడు. అందుకే అతను ప్రతి నిముషమూ తెల్లబోతున్నాడు.

"... ఇద్దరు పరస్పరం విభేదించుకున్నారంటే అందుకు బలమైన కారణం వుండివుంటుంది. అది జీవితంలో ఏదో వొక విచ్ఛిన్న కోణానికి సంబంధించిందే అయివుంటుంది. నర్సిమ్ములును నాచనసోముడు తిట్టాడనటం వాస్తవమే కావచ్చు. నాచనసోముడు నర్సిమ్ములును కొట్టాడనటమూ వాస్తవమే కావచ్చు. కానీ,...ఈ రెంటి మధ్య చాలా తేడాలున్నాయి. ప్రపంచాన్ని అర్థంచేసుకునే తీరులో వొక్కొక్కరికీ వొక్కో విధమైన ఆంతరంగిక వైరుధ్యముంటుంది. వీరాపురం సాంబశివుడు నర్సిమ్ములు వైపు మాట్లాడంటే నర్సిమ్ములు నుంచి సాంబశివుడు ఆశిస్తున్న సాయం వొకటి తప్పకుండా వుంటుంది. గతం అనేది ఒక కోణం. దానినుంచి శాఖలుగా విడిపోయే కొత్త కోణాల గురించి పరిశీలించేప్పుడు గతాన్ని గుర్తుంచుకోవాలి. సోముడు తుంటరే. నర్సిమ్ములూ తక్కువవాడు కాదు. వీరిద్దరి జీవితాల మధ్య ఎప్పటినుంచో వైరుధ్యాలున్నాయి. వీటికి ఇప్పుడు వేదిక దొరికింది. కాబట్టి ప్రపంచం ముందు తేల్చుకుంటానికి ఇద్దరూ సంసిద్ధులయ్యారు. అంతే..! దీనికి కట్టుబాటు చెప్పే తీర్పు చాలు. కాలుష్యం పొర కమ్మిన నాగరికసిద్ధాంతాలు అక్కర్లేదు...."

గౌర్రెడ్డి తను నమ్మే నాగరిక సిద్ధాంతాలను గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. తనకర్థమైన పోలీసు సిద్ధాంతాల గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. సున్నితమైన తన అంతరంగాన్ని పోలీసు వ్యవస్థ ఎలా మార్చేసిందీ అర్థం చేసుకుంటున్నాడు.

గౌర్రెడ్డికిప్పుడు ప్రపంచం అర్థమవుతూ వస్తోంది. నెమ్మదిగా చెమ్మగిల్లుతుంటాడు. వెంకట్రాముడి సంభాషణ తనలోని అంతరంగిక సంభాషణలా వినిపిస్తోంది. తన జీవితం గురించి ఆలోచన మొదలుపెట్టాడతను. తనలోని వైరుధ్యాల్ని వెతుక్కోవటం మొదలుపెట్టాడు.

పోలీసు వృత్తికీ, తన జీవితానికీ ఏం సంబంధం లేదని తేల్చుకున్నాడు. తన జీవితంలో ఏ కోణంలోనూ ప్రేమ తాలూకు సంభాషణల్లేవని వెల్లడి చేసుకున్నాడు. తను నమ్మే సిద్ధాంతాలు తన వృత్తికి సంబంధించిన వ్యవస్థ కోసం తప్ప జనజీవితానికి ఉపయోగ పడవని నిర్ధారించుకున్నాడు. జనజీవితానికీ, తన వృత్తికీ ఏ మాత్రం సంబంధం లేదని మళ్ళీ స్పష్టం చేసుకున్నాడు.

ఇప్పుడతను నిజమైన మనిషిలా ఆలోచిస్తున్నాడు.

వెంకట్రాముడు మరేమీ మాట్లాడాల్సిన అవసరం కలగలేదు. గౌర్రెడ్డి రోడ్డుమీద నిటారునడకలో పడ్డాడు. అతని టోపీ,లాఠీల పని ముగిసింది. అవిప్పుడు రోడ్డుపక్క కంపలో తారట్లాడుతున్నాయి.

*　　　*　　　*

రచ్చబండ మీద వెంకట్రాముడు తీర్పు చెప్పాడు.

"వ్యక్తిగత వైరుధ్యాలు సమాజజీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయం ఈ తగువులో స్పష్టంగా కనిపిస్తోంది. వీళ్ళిద్దరి సమస్యకు అంతర్గతంగా మరో సమస్య వుంది. స్వావలంబన. ఆర్థికంగా,సామాజికంగా ఒకరికంటే ఒకరు తక్కువ కాదని నిరూపించుకోవాలనే ఇజాలే నాచనసోముణ్ణి,నర్సిమ్ములును ప్రోత్సహించాయి. ఇలాంటి అవకాశాల్ని తమకు అనువుగా మలుచుకునే సాంబశివుడు, గౌర్రెడ్డి లాంటి శక్తులు సమాజ జీవితాన్ని విచ్ఛిన్నం చేస్తాయే తప్ప అరమరికల్లేని వాతావరణాన్ని కల్పించలేవు. ఈ కేసు తరతరాల వ్యవస్థ తీరుతెన్నులతో ముడిపడింది. ఇందులో ఇద్దరూ తప్పు చేయలేదు. తప్పు పేదరికానిది కాదు. పేదరికాన్ని తరతరాలుగా వారసత్వంగా అందించిన అర్థవలస,దళారీ,పెత్తందారీ, భూస్వామ్యవర్గాలది. వ్యవస్థలో మార్పు తీసుకురావటమే అసలైన తీర్పు"

'తీర్పు నేపథ్యం మరికొందరికి ఇంకా అర్థం కావాలి' తనలో తాను అనుకున్నాడు వెంకట్రాముడు.

— గోపాత్రుడికి వ్యంగ్యంగా..! —